క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని ఎనిమిద వార్డులో బుధవారం నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నబిర సూల్, షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు వార్డులో సీసీ రోడ్లు వేస్తున్నట్లు చెప్పారు. వార్డులోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మూడవ వార్డు కౌన్సిలర్ మీర్ యూనస్, వహీద్, జబీద్, వలి పాల్గొన్నారు.

నూతన వీధి దీపాల ఏర్పాటు

ఆత్మకూరు పట్టణంలోని పలు వార్డుల్లో నూతనంగా ఏర్పాటు చేసిన కరెంట్ స్తంభాలకు వీధిదీపాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని 21 వ వార్డులో నూతన విద్యుత్ స్తంభాలకు వీధిదీపాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వెలుగోడు: దసరా సెలవులలో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఎన్వీ సుమలత సూచించారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డిపాల్ స్కూలు, లిటిల్ ఏంజెల్ స్కూల్‌లలో విద్యార్థులకు గ్రంథాలయ విశిష్టతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. దసరా సెలవుల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిన్నప్పటి నుంచే గ్రంథాలయంలో పుస్తకాల్లో చదవడం అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు.

డంప్‌యార్డుకు నిప్పు



డంప్‌యార్డులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నందికొట్కూరు: పట్టణంలోని డంప్‌యార్డుకు ఆకతాయిలు మంగళవారం నిప్పు పెట్టారు. దీంతో రెండు రోజుల నుంచి పట్టణంలో పొగలు కమ్ముకున్నాయి. ఆయా కాలనీల ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్ ఫైరింజన్‌తో, జేసీబీతో మంటలను అదుపులోకి తెచ్చారు. మున్సిపల్ సిబ్బంది కూడా శ్రమించారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలో బొల్లవరం గ్రామంలోని సాయిబాబ గుడి వద్ద రోడ్డు దాటుతున్న శాంతమ్మ అనే మహిళను ఎరువుల లోడుతో వెళ్తున్న లారీ ఢీకొనడంతో గాయాలపాలైనట్లు ఎస్.ఐ ఓబులేసు తెలిపారు. ఈ సంఘటనలో మహిళ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

వైస్ ఎంపీపీకి పితృ వియోగం

వెలుగోడు: పట్టణానికి చెందిన వైస్ ఎంపీపీ నసిరుద్దీన్ తండ్రి షేక్ నూరుద్దీన్ (75) బుధవారం వేకువ జామున కన్నుమూశారు. వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి నసిరుద్దీన్ ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. మృతికి కారణాలు తెలుసుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భువనేశ్వర్‌రెడ్డి వెంట జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, మైనారిటీ నాయకులు ఉన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆత్మకూరు: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ప్రభుత్వ డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపల్ పద్మావతిబాయి అన్నారు. డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలను విద్యా వంతులుగా చేయడమే కాకుండా, వారు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బాలికలు, మహిళలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సాధికారిక కో ఆర్డినేటర్ తిరుపతమ్మ, అధ్యాపకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: ఇప్పటిదాకా వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తించని వారు ఈనెల 15లోగా గ్రామాల్లోని ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. నాలుగేళ్ల కాలంలో ఇప్పటిదాకా రైతు భరోసా పథకం వర్తించని రైతులు పొలం పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డును తీసుకొని వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. నమోదు చేయించుకొన్న రైతుల వివరాలను తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి ఈనెల 18వ తేదీ లోగా ధ్రువీకరించి జిల్లా అధికారులకు పంపుతారన్నారు.

ప్రజల ఆరోగ్యానికి 'జగనన్న సురక్ష'

- గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు
- ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



మిట్టకందాలలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పాములపాడు: ప్రజలందరి ఆరోగ్యానికి భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ప్రజలతో మాట్లాడి వైద్య సేవలెలా అందుతున్నాయని ఆరా తీశారు. అలాగే వైద్యులతో మాట్లాడారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను, ప్రజలకు నిర్వహిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలకు నైపుణ్యమైన డాక్టర్లు వచ్చి వైద్యసేవలందించేలా చర్యలు చేపట్టిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వివరించారు. శిబిరంలో 712 మందికి వైద్య సేవలందించగా, 16 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్‌చేశారు. 240 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఆరుగురిని శస్త్ర చికిత్సలకు రెఫర్‌చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ బీఎంహెచ్ఓ కాంతారావునాయక్, ఎంపీడీఓ గోపీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, సర్పంచు నారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు ముర్తుజాబీ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల్లోనూ వైద్యసేవలు

మహానంది: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు సైతం వైద్యసేవలు అందుతున్నామని శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం చిన్నదేవలాపురంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. బండిఆత్మకూరు, నారాయణాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ప్రజలకు వైద్యసేవలు అందించారు. క్యాంపులో ఒకే రోజు 625 మందికి వైద్యచికిత్సలు అందించి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్త తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, సర్పంచ్ ఆవులపాటి మధుసూదన్ చౌదరి, ఎంపీటీసీ వెంకటలక్ష్మమ్మ, జేసీఎస్ మండల అధ్యక్షుడు ముడిమెల పుల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌లో జగనన్న ఆరోగ్య సురక్షకు గిరిజనులు

చిన్నదేవలాపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి నారపురెడ్డికుంటకు చెందిన గిరిజనులు హాజరయ్యారు. ఎంపీడీఓ వాసుదేవ గుప్త, వైద్యాధికారులు ప్రత్యేకంగా ట్రాక్టర్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో నాలుగుకిలోమీటర్ల నుంచి వారు చిన్నదేవలాపురం గ్రామానికి వచ్చి వైద్యసేవలు పొందారు. వారికి అధికారులు, ప్రజాప్రతినిధులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

నందికొట్కూరు రూరల్ : పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నాగటూరు గ్రామ సర్పంచ్ చెవుల సుజాత, ఈవోఆర్డీ సంజన్న తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు మనోజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే జగనన్న సంకల్పం

జూపాడుబంగ్లా: ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని అందుకోసం ఆయన అహర్నిశలు కృషిచేస్తున్నారని జెడ్పీటీసీ పోచా జగదీశ్వర రెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, జిల్లా జాయింట్ సెక్రెటరీ తిరుమలేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ పీఎం నాగిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తర్తూరు గ్రామంలో సర్పంచ్ పీఎం నాగిరెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అలాగే నియోజకవర్గ ప్రత్యేకాధికారి రఘురాం వైద్యశిబిరాన్ని పరిశీలించి మ్యానువల్‌గానే బీపీ పరీక్షలు నిర్వహించాలని వైద్యులు, వైద్యసిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, వైద్యులు డాక్టర్ యశ్విని, డాక్టర్ గంగాధర్, జిల్లా జాయింట్ సెక్రెటరీ తిరుమలేశ్వరరెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



తర్తూరులో బీపీ పరీక్షలను పరిశీలిస్తున్న నియోజకవర్గ స్పెషల్ అధికారి రఘురాం



తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డికి బీపీ పరీక్ష చేస్తున్న డాక్టర్ యశశ్విని

పేదల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష

వెలుగోడు: గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకమే జగనన్న సురక్ష అని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 2వ సచివాలయంలో పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎం ఇలియాస్ ఖాన్, నాయకులు షంషీర్, జెడ్పీ కో –ఆప్షన్ నెంబర్ సయ్యద్ సులేమాన్, సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, ఉప ఎంపీపీలు నసీరుద్దీన్, శంకర్ నాయక్, వైఎస్ఆర్ సీపీ వైద్య విభాగం జిల్లా కార్యదర్శి డాక్టర్ నాగ శేషులు, నాయకులు పాల్గొన్నారు.



వెలుగోడు పట్టణంలో హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

నందికుంటలో వైద్య శిబిరం

కొత్తపల్లి: మండలంలోని నందికుంట గ్రామంలో సర్పంచ్ నిత్య లక్ష్మీదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, , డిప్యూటీ ఎంహెచ్ఓ కాంతారావు నాయక్ సందర్శించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే స్వయంగా షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో 501 మంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, 30 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 41 మందికి కంటి ఆపరేషన్ల కోసం, 08 మందిని ఇతర వ్యాధులకు మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశామని వైద్యురాలు దీపానాగవేణి అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం అధికారులు జగదీష్ చంద్ర రెడ్డి, రఘురాం, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నందికుంటలో షుగర్ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే ఆర్థర్

కంటి పరీక్షలు చేయించుకున్నా



ఇంతకు ముందు కంటి ఆపరేషన్ చేయించుకున్నాను. ఇప్పుడు మరొకసారి కళ్ల పని తీరు ఎలా ఉందో తెలుసుకునేందుకు పరీక్ష చేయించుకున్నా. డాక్టరు చూసి ఉచితంగా మందులు ఇచ్చారు. ఇన్ని సౌకర్యాలతో ప్రజలకు పరీక్షలు చేసి మందులు ఊర్లోనే ఇస్తుండటం గొప్ప విషయమే.

–బత్తిని సుబ్బమ్మ, మిట్టకందాల

బీపీ, షుగర్ ఉందని చెప్పారు



సారొళ్లు రక్త పరీక్ష చేసి షుగరు ఉందని, బీపీ పరీక్ష చేసి బీపీ ఉందని చెప్పారు. తరువాత డాక్టరు మేడం వద్దకు వెళ్లి చూపించుకున్నాను. ఉచితంగా మందులు ఇచ్చారు. మా ఊరికే డాక్టర్లు వచ్చి ఇన్ని రకాల పరీక్షలు ఎప్పుడూ చేయలేదు. ఇలా చేయడం మాలాంటి ముసలోళ్లకు ఎంతో ఊరట.

–ముర్తుజాబీ, మిట్టకందాల

కంటి అద్దాలు ఇస్తామన్నారు



నా వయస్సు 90ఏళ్లు. నేను ఓ కంటికి ఆపరేషన్ చేయించుకున్నారు. మరో కన్ను సరిగ్గా కనిపించడం లేదని పరీక్షలు చేయించుకోవటానికి సారొళ్లవద్దకు వచ్చాను. సారొళ్లు మంచిగా కంటిపరీక్షలు చేసి కళ్లల్లోకి చుక్కల మందు ఇచ్చారు. త్వరలో అద్దాలు ఇస్తామన్నారు. ఆపరేషన్ చేయించుకుంటానంటే కర్నూలుకు పంపించి కంటికి ఆపరేషన్ చేపిస్తామని డాక్టరొళ్లు చెప్పారు.

– పార్వతమ్మ, తర్తూరు

పరీక్షలన్నీ ఉచితంగా చేస్తున్నారు



గ్రామంలోనే నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బందిచే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ద్వారా పరీక్షలన్నీ ఉచితంగా చేస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నేను బీపీ, షుగర్, గ్యాస్ట్రబుల్, కీళ్లనొప్పులకు పరీక్షలు చేయించుకున్నా. మందులు కూడా ఉచితంగానే ఇచ్చారు.

–నాగలింగమ్మ, నందికుంట

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు



ఆర్టీసీ ఉద్యోగులకు చెక్కు అందజేస్తున్న డీఎం మహేంద్రుడు

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో బుధవారం ఆర్టీసీ ఉద్యోగులకు డీఎం మహేంద్రుడు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అత్యధిక డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లు, అధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లకు ప్రోత్సాహక బహుమతుల కింద చెక్కులు అందజేస్తున్నట్లు చెప్పారు. అధిక డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లు వలి, శివారెడ్డి, టీఆర్‌సి రెడ్డి, అధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లు నాగమ్మ, సుబ్బలక్ష్మి, వెంకటస్వామి, రామలింగారెడ్డి, మహేశ్వరి, షేక్షావలిలకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు సన్మానం

ఉద్యోగులకు బదిలీలు సాధారణమని ఆర్టీసీ డీఎం మహేంద్రుడు అన్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి నంద్యాల డిపోకు బదిలీపై వెళ్తున్న సూపరింటెండెంట్ తిమ్మయ్యను డిపో ఆవరణలో సన్మానించారు. ఉద్యోగులు పలువురు ఆయనను దుశ్శాలువా, పూలమాలలో సత్కరించారు.

రక్తదానంతో ప్రాణదానం

ఆత్మకూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఇతరులకు ప్రాణదాతలు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటనరసయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఇతరుల ప్రాణాలను కాపాడడమే కాకుండా, మానసిక ఆరోగ్యం, శరీర చురుకుదనం పెరుగుతుందన్నారు. రక్తదానం చేయడం వలన కొత్తరక్తకణాలు 48 గంటల్లో ఉత్పత్తి అవుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, నవీన్, చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ పద్మావతి బాయి, విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

15 నుంచి దేవీశరన్నవరాత్రులు

కొత్తపల్లి: మండల పరిధిలోని కొలనుభారతి దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ మోహన్ బుధవారం తెలిపారు. నవరాత్రుల్లో భాగంగా 15న అమ్మవారు శ్రీ బాలత్రిపుర సుందరీదేవి, 16న శ్రీ గాయత్రిదేవి, 17న శ్రీ అన్నపూర్ణదేవి, 18 శ్రీ లలితా దేవి, 19న శ్రీ మహాలక్ష్మీదేవి, 20న శ్రీ సరస్వతి దేవి (అమ్మవారి మూలనక్షత్రం) 21న శ్రీ దుర్గా దేవి(దుర్గాష్టమి) 22న శ్రీ మహిషాసురమర్థిని దేవి, 23 శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారాలలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నందికొట్కూరులో..

నందికొట్కూరు: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 15 నుంచి దేవి శరన్నవరాత్రులు ప్రారంభమవుతునట్లు ఆలయ కమిటీ సభ్యులు నాగసత్యనారాయణ, జయరామకృష్ణ, నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని అమ్మవారి సన్నిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 23న సాయంత్రం శమీ దర్శనము, 24న ఊరివిందు, వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ ఫైజున్నిసా

నందికొట్కూరు: పట్టణంలోని శ్రీ నవనంది ఇంగ్లిష్ మీడియం హై స్కూల్‌లో బుధవారం అండర్ – 14, 17 ఉమ్మడి జిల్లాస్థాయి జూడో ఎంపిక పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. దాదాపుగా 300 మంది మందికి పైగా జూడో క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాపోటీలను నందికొట్కూరు ఎంఈఓ ఫైజున్నీసా, జూడో రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు ప్రభాకర్, నంద్యాల జిల్లా శాప్ కోఆర్డినేటర్ స్వామి దాసు రవి, రాష్ట్ర ఫిట్ ఇండియా కోఆర్డినేటర్ బి విశ్వనాథ్ ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివ కుమార్, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డోర్తి, భాస్కర్ రెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

ఖోఖో శిక్షణ శిబిరం ప్రారంభం

పగిడ్యాల: ఈనెల 19న చిత్తూరు జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ విభాగం ఖో ఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణా క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా ఖోఖో అసోషియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల్లో రాణించి జిల్లా కీర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, క్రీడాశ్రీ పీతాంబరరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఖోఖో జిల్లా చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి

మల్లన్నను దర్శించుకున్న ఎంపీ గోరంట్ల మాధవ్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను హిందూపూర్ ఎంపీ గోరంట్ల మాధవ్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఎంపీకి ఆలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ మల్లికార్జునస్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బీరప్ప సదన్‌లో ఆంధ్రా–తెలంగాణ సత్ర కమిటీ వివాదాలను మంత్రి సమక్షంలో పరిష్కరించారు.

పాత ముచ్చుమర్రిలో బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు

పగిడ్యాల: మండంలోని పాత ముచ్చుమర్రిలోని ఆర్ఎంపీ కరీం క్లినిక్, ఇంట్లో బుధవారం నందికొట్కూరు రూరల్ సీఐ విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు చేశారు. మూడు నెలల క్రితం కొత్త ముచ్చుమర్రిలోని బోయ మధు ఇంటి నీళ్ల ట్యాంక్‌లో 22 నాటుబాంబులు లభ్యమైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆర్ఎంపీ కరీం నిందితుడిగా ఉన్నాడు. క్లినిక్, ఇంటిలో బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు చేయగా ఏలాంటి బాంబులు లభ్యం కాలేదని సీఐ వివరించారు. సీఐ వెంట మిడుతూరు ఎస్ఐ జగన్‌మోహన్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ

పగిడ్యాల: జగనన్న గోరు ముద్ద కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తయారీ నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన వంట సామగ్రిని మండలంలోని 27 పాఠశాలలకు బుధవారం పంపిణీ చేసినట్లు విద్యాధికారి సుభాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 మురళీమోహన్ రెడ్డి, సీఆర్‌పీలు తదితరులు ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్ నియామకం

మహానంది: బండిఆత్మకూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ స్థానంలో కళావతమ్మను నియమిస్తూ ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గడివేముల మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న కళావతమ్మను డిప్యూటేషన్‌పై బదిలీ చేశారని అధికారులు తెలిపారు.

అడవిలోకి వెళ్తే కఠిన చర్యలు

మహానంది: ఎవరైనా అనుమతులు లేకుండా అడవుల్లోకి వెళ్లి వెదుర్లు, చెట్లు నరికి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా హెచ్చరించారు. ఎరుకలకాలనీ గ్రామంలో బుధవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడవులు, కుల వృత్తులపై ఆధారపడి జీవించేవారు 15మందితో సొసైటీ రిజిస్టర్ చేసుకోవాలని, ప్రభుత్వం సొసైటీల ద్వారా తక్కువ ధరలకే వెదురు సరఫరా చేస్తుందన్నారు. వెదురు తెచ్చుకుని కులవృత్తులు చేసుకోవచ్చని చెప్పారు.



మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ నాసిర్‌జా

విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దాలి



జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో జెడ్పీటీసీ , వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో తీర్చిదిద్దాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను బుధవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం మగ్బూల్ బాషా, పీఈటీ విజయమ్మ, పీఎంసీ చైర్మన్ మండ్ల ప్రమీలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు హేమశేఖర్ రెడ్డి, పోచా లోకేశ్వర్‌రెడ్డి, మండ్ల రాముడు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

నందికొట్కూరు: మున్సిపల్ జై కిసాన్ పార్క్‌లో బుధవారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. 120 మంది మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిశోర్ చేతుల మీదుగా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, మోహనరావు, వెంకటరావు, వెంకటరామయ్య, శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలో బుధవారం మృతిచెందిన వానరానికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామసచివాలయం–2 వెనకాల వానరం కళేబరాన్ని గమనించిన గ్రామస్తులు అంజి, నాగరాజు, పక్కీరయ్య, మరికొంత మంది తీసుకొచ్చి.. స్నానంచేయించి కుంకుమ, పసుపు, పూలతో అలంకరించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

సమయపాలన పాటించకపోవడం బాధాకరం

పగిడ్యాల: అధికారులు సమయపాలన పాటించకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండో రోజైన బుధవారం నెహ్రూనగర్ సచివాలయం –1 పరిధిలోని అర్లపాడు గ్రామం నుంచి గడప గడప కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 3 గంటలకు హాజరు కావాల్సిన అధికారులు 3.30 గంటలైన రాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే పునరావృతమైతే క్షమించేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి మంచి అవకాశం కల్పించారని, వారి సమస్యలు వింటుంటే బాధేస్తోందని ఆవేదనకు గురయ్యారు. బుడుగజంగాల కాలనీలో సరైన వీధిలైట్లు, సీసీ రోడ్లు, అస్తవ్యస్తంగా రోడ్లపైనే మురుగునీరు ప్రవహిస్తోందని, పిల్లాపాపలతో వారు ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణాతీతంగా ఉన్నాయన్నారు. వారం రోజుల్లోగా సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాయివిజయ, శ్రీనివాసులుగౌడ్, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బుదగజంగాల కాలనీలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నివాళి

జూపాడుబంగ్లా: అనారోగ్యంతో మృతిచెందిన కానిస్టేబుల్ చెన్నయ్య తండ్రి మాదన్న పార్థివదేహానికి నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ బుధవారం నివాళులర్పించారు. నందికొట్కూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో క్రైం పార్టీ కానిస్టేబుల్‌గా చెన్నయ్య విధులు నిర్వహిస్తున్నాడు. చెన్నయ్య తండ్రి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటివద్దకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

సాంకేతిక సమస్యలతోనే విద్యుత్ అంతరాయం

మహానంది: విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలో సాంకేతిక సమస్యలు రావడంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్‌శాఖ నంద్యాల రూరల్ ఏడీ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మహానంది సబ్‌స్టేషన్‌లో బుధవారం తనిఖీలు నిర్వహించి వివిధ రికార్డులు పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రెండు లేదా మూడురోజుల అనంతరం వ్యవసాయ, గృహ వినియోగదారులకు పూర్తిస్థాయిలో సరఫరా ఇస్తామన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఏఈఈ ప్రభాకర్‌రెడ్డి, జేఈ శివశంకర్, సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు.